క్లుప్తంగా

చేతి వృత్తులతో స్వయం ఉపాధి



శిక్షణ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తూ, వారి స్వయం ఉపాధికి తోడ్పాటునందిస్తున్నామని దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వర్రావు అన్నారు. మండలంలోని రాధేయపాలెంలో మగ్గం వర్క్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. సుమారు 40 మంది మహిళలు హాజరయ్యారు. రాజానగరం, కోరుకొండ, రంగంపేట, రాజమహేంద్రవరం రూరల్ మండలాలకు చెందిన వేల మంది మహిళలకు ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్క్, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. వారందరూ వృత్తుల్లో ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నురుకుర్తి దుర్గ, శిక్షకురాలు జంగిలి కుమారి, ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని కోటపాడు గ్రామ శివారు శ్రీరామ్ ఫామ్స్ ఎదురుగా ఏడీబీ రోడ్డుపై ఈ నెల 5వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఓ యాచకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయాలపాలైన అతడిని స్థానికులు 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కోటపాడు వీఆర్ఓ దొరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

15న మోక్షారోహణ పండగ

మధురపూడి: ఏసుక్రీస్తు తల్లి మేరీమాత మోక్షారోహణ పండగను ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం ఫాదర్ మనోజ్ కుమార్ తెలిపారు. ఆ రోజు రాజమహేంద్రవరంలోని గోదావరి రైల్వేస్టేషన్ పక్కనే గల చర్చిలో మేరీమాత జపమాల, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. మరియదళం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అంకితభావంతో పనిచేస్తే చిరస్థాయి గుర్తింపు



రంగంపేట హైస్కూల్లో సత్కారం పొందిన ఉపాధ్యాయులు

రంగంపేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఇటీవల ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించి మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల మేలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన విజయభారతి, కృష్ణారెడ్డి, వెంకటలక్ష్మి, సుమబాల, కమలప్రశాంతి, నాగలక్ష్మిలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

రాజవోలులో 'వైఎస్సార్ పొలంబడి'



పొలంబడిలో సూచనలిస్తున్న డీసీఆర్ ఏడీఏ జయరామలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి అబ్బిరెడ్డి భీమరాజు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ జయరామలక్ష్మి మాట్లాడుతూ వరి నాటిన 45 రోజులలోపు పురుగులు, తెగుళ్ల ఆశిస్తే, వాటికి మందు కొట్టకుండా భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన (పీఏఆర్) ప్రయోగం చేశామన్నారు. ఇందులో భాగంగా ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు చేసినట్టు తెలిపారు. గతవారం నిర్వహించిన ప్రయోగం వివరాలు ఈ వారం నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. నాటిన 45 రోజులలోపు వరి పంటకు పునరుజ్జీవన శక్తి ఉండటం వల్ల తెగుళ్ల ఆశించినా తిరిగి పునరుత్పత్తి చేసుకుంటుందన్నారు. కాబట్టి ఆకులు, పిలకలు నష్టపోయినా కోలుకుంటుందన్నారు. కార్యక్రమంలో పొలంబడి రైతులు, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు దుర్గబాబు, పుష్ప, వీఏఏలు పాల్గొన్నారు.

కొండ గోదారి.. ముంపులో వరి

- ముంపుబారిన పొలాలు
- అన్నదాతల ఆవేదన



నల్గొండ వద్ద కొండగోదారి ముంపులో వరిపంట

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 1,800 ఎకరాల వరిపంట కొండ గోదారి ముంపులో ఉంది. పది రోజులుగా రఘుదేవపురం, నల్గొండ, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, చినకొండేపూడి, రామచంద్రపురం, వంగలపూడి గ్రామాల్లో పంటలు ముంపులోకి వెళ్లాయి. కొండగోదారి ఎగపోటుతో ఈ పరిస్థితి నెలకొంది. అఖండ గోదావరి వరదతో పది రోజుల క్రితం బొబ్బిల్లంకలోని స్లూయిజ్ గేట్లు ఆటోమేటిక్‌గా మూసుకుపోయాయి. మండలంలో కురిసిన వర్షాలతో పాటు గోకవరం, కోరుకొండ మండలాల్లోని వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన మిగులు జలాలు.. బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. ఆ సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటిమట్టం పెరిగితే బొబ్బిల్లంకలోని స్లూయిజ్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. తగ్గితే గేట్లు తెరచుకుని కొండగోదారి నీరు స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళుతుంది.

ముంపులోకి..

పది రోజుల క్రితం గోదావరి నీటిమట్టం పెరగడంతో కొండ గోదారితో వరిపంట భూములు ముంపులోకి వెళ్లాయి. వారం రోజుల క్రితం వరద నీటిమట్టం తగ్గడంతో బొబ్బిల్లంక స్లూయిజ్ గేటు తెరచుకుని కొండగోదారి నీరంతా గోదావరిలోకి కలుస్తోంది. అయితే నీటిని మిర్తిపాడు – బొబ్బిల్లంక మధ్య లోకల్వర్టు అడ్డుకోవడంతో నీరు నెమ్మదిగా స్లూయిజ్ ద్వారా వెళుతోంది. దీంతో మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల్లోని వరిపంట ముంపు నుంచి తేరుకోలేదు. ముంపులోకి వెళ్లిన 1,800 ఎకరాలలో సుమారుగా 1,100 ఎకరాలు తేరుకుంది. అందులో రోజుల సమయంలో నాటిన వరిపంట కుళ్లిపోయింది. ఇంకా 700 ఎకరాలు నీట మునిగి ఉంది. కొండగోదారి నీరు పూర్తిస్థాయిలో తీసిన తర్వాత పంటల పరిస్థితి తెలుస్తుంది. రైతులు ఎకరానికి రూ 10 వేలు నుంచి రూ 15 వేలు పెట్టుబడి నష్టపోయే అవకాశం ఉంది.

రెండు ఎకరాల్లో నష్టం



పది ఎకరాల వరిపంట కొండ గోదారి ముంపులోకి వెళ్లింది. అందులో ఎనిమిది ఎకరాల్లో నీరు లాగేసింది. పల్లంలో సాగు చేసిన రెండు ఎకరాలు పాడైపోయింది. ఎకరానికి రూ.15 వేలు ఖర్చు అయ్యింది. తిరిగి వరినాట్లు వేయాలి. వరి ఆకు దొరకడం కష్టం. రెండు ఎకరాలు నష్టం మిగిల్చింది.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు, మిర్తిపాడు

ముంపులోనే పంట



మండలంలో పలు గ్రామాల్లో వరిపంట కొండగోదారి కారణంగా ముంపులోకి వెళ్లింది. వరినాట్లు వేసి 40 రోజులు పూర్తయితేనే ప్రభుత్వ నుంచి పరిహారం పొందవచ్చు. కానీ వరినాట్లు వేసి నెల రోజులు కూడా అవ్వలేదు. పంటనష్టం అంచనా వేయడానికి అవకాశం లేదు. పలు గ్రామాల్లో ఇంకా వరిపంట ముంపులోనే ఉంది.

– కె.సూర్యరమేష్, ఏఓ, సీతానగరం

ఆల్బెండజోల్ మాత్రలు మింగేలా చూడాలి

పెదపూడి: విద్యార్థులు, యువతలో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగేలా చూడాలని సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి శ్యామల బుధవారం అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న మొత్తం 2,216 మంది విద్యార్థులతో మాత్రలు మింగించాలని సిబ్బందికి సూచించామన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల కడుపులో నులి పురుగులు నశించి విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను సాధిస్తారన్నారు. ఏడాది లోపు వయసున్న చిన్నారులకు ఈ మాత్రలు ఇవ్వకూడదని చెప్పారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

పెదపూడి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండ గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, ప్రీస్కూల్ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లు వెంకటరమణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

కొమరిపాలెం ప్రజల చిరకాల కోరిక తీరుస్తాం

- కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి
- రూ.6.85 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



కొమరిపాలెంలో 'నా భూమి-నా దేశం' శిలాఫలకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: కొమరిపాలెం ప్రజలు చిరకాలంగా కోరుతున్న ఇంటి స్థలాలను త్వరలోనే పంపిణీ చేస్తామని కలెక్టర్ మాధవీలత అన్నారు. బుధవారం మండలంలోని కొమరిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి రూ.6.85 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. రూ.6.46 కోట్లతో బలభద్రపురం-రాయవరం రోడ్డుతో పాటు కొమరిపాలెంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో చేపట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, దాతల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో కొమరిపాలెం తననెంతో ఆకట్టుకుందని, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే ఈ ప్రాంత అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కొమరిపాలెం ప్రజలకు ఇంటి స్థలాల మంజూరు అంశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మరోసారి తీసుకెళ్లారన్నారు. ఇప్పటికే భూసేకరణ చేశామని, త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. కలెక్టర్ మాధవీలత 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు.

దేశానికే ఆదర్శం

సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థ, రైతు సంక్షేమం కోసం ఆర్బీకేలు, గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణకు డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషకుమారి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ బొబ్బిలి గంగా భవాని, పారిశామిక వేత్తలు కొవ్వూరి పాపారెడ్డి, చింతా పాండు రంగారెడ్డి, కొవ్వూరి చిన్నబుజ్జి, రొంగల అప్పాజీ, పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా

రాజానగరం: వెలుగుబందకు చెందిన గవరసాని గంగాధర్ ఆత్మహత్యకు కారకుడైన కడలి వెంకటేశ్వర్రావుకు ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ తీర్పునిచ్చారు. సీఐ కాశీవిశ్వనాథ్ బుధవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 అక్టోబర్‌లో ఆత్మహత్య చేసుకున్న గంగాధర్ మృతిపై అతని తండ్రి చేసిన ఫిర్యాదు ఆధారంగా వెంకటేశ్వరరావు నిందితుడిగా పేర్కొంటూ అప్పటి ఎస్సై సీహెచ్. సుమన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అడిషనల్ పీపీగా కోడి సతీష్ నాయుడు వాదించారు.

రెండో రోజూ పడని నామినేషన్లు

అనపర్తి: మండల పరిధిలోని దుప్పలపూడి, రామవరం గ్రామ పంచాయతీల పరిధిలో మూడు వార్డు స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి రెండో రోజు బుధవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి తెలిపారు.

నన్నయలో హోమియో వైద్య శిబిరం



వైద్యులను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని డాక్టర్ వినయ్ సుంకర హెల్త్ సెంటర్‌లో బుధవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. పిఠాపురానికి చెందిన డాక్టర్ ఉమర్ ఆలీషా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రతి బుధవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ట్రస్టు సభ్యులు డాక్టర్ ఆనంద్ కుమార్ పింగళి, డాక్టర్ ఎస్.ఆనందరావు పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తారని వక్తలు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆచార్య టి.అశోక్, డాక్టర్ పి.విజయనిర్మల పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు స్కిల్ కాలేజీలో శిక్షణ

రాజానగరం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న స్కిల్ కాలేజీలో గ్రామీణ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని స్కిల్ కాలేజ్ కో ఆర్డినేటర్ డాక్టర్ అల్లమరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీడాప్ – డీడీయూ పథకంలో ప్లంబింగ్ సూపర్‌వైజర్, ఫోర్‌మ్యాన్ ఎలక్ట్రికల్ వర్క్స్ – కనస్ట్రక్షన్ కోర్సులలో మూడు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణకు 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల యువత అర్హులన్నారు. భోజన సదుపాయంతో పాటు స్టడీ, సేఫ్టీ మెటీరియల్స్ అందిస్తూ, ప్లంబింగ్ సూపర్ వైజర్, ఫోర్‌మ్యాన్ ఎలక్ట్రికల్ వర్క్స్ – కనస్ట్రక్షన్ కోర్సులలో శిక్షణ ఇస్తారన్నారు. ప్లంబింగ్ సూపర్‌వైజర్ శిక్షణకు ఒకేషనల్ ఇంటర్మీడియట్ ప్లంబింగ్ లేదా సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్‌తో డిప్లమా లేదా ఐటీఐ ప్లంబింగ్ చేసి, 3, 4 సంవత్సరాల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. నేషనల్ క్వాఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ లెవెల్ ఫోర్ సర్టిఫికెట్ ఉన్న వారు కూడా అర్హులేనని తెలిపారు. కనస్ట్రక్షన్ ఫోర్‌మ్యాన్ ఎలక్ట్రికల్ వర్క్స్‌లో ప్రవేశానికి ఐటీఐ లేదా డిప్లమా ఎలక్ట్రికల్ లేదా ఇంటర్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ ఎలక్ట్రికల్ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఫ్యాకల్టీ మెంబర్ పి.జయలక్ష్మి (89197 84495), ఎం.కనకదుర్గ మహాలక్ష్మి (62811 14627)ని సంప్రదించాలన్నారు.

ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేపై సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్

పెదపూడి: ఇంటింటా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలకు ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 21 నుంచి ఈ నెల 21 వరకూ సర్వే జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా సర్వే, పరిశీలన నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి సర్వే చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, డీటీ రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత మోహిత్‌కు సన్మానం



క్రీడాకారుడు శ్రీమోహిత్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

ప్రకాశం నగర్: ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 19 సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన కొత్తపల్లి శ్రీమోహిత్‌ను బుధవారం స్థానిక ఆనంద్ రీజెన్సీలోని నగర కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, యర్రా వేణు గోపాలరాయుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అరిగెల బాబు, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మోహిత్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. తండ్రి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాబు ప్రోత్సాహంతో మోహిత్ ఇంటర్ చదువుతూ బ్యాడ్మింటన్‌లో రికార్డులు సృష్టించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు బొంతా శ్రీహరి, మానె దొరబాబు, బీజేపీ నాయకులు యెనుముల రంగబాబు, ఆడబాల రామకృష్ణ, పురంశెట్టి ప్రసాద్, మురళీ, చవ్వాకుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సత్రం భూములకు బహిరంగ వేలం వేయాలి



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంపయర్రంపాలెంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములు సుమారు 67 ఎకరాలకు పాట నిర్వహించగా అందులో 31 ఎకరాలకు ఎటువంటి డబ్బులు చెల్లించకుండా భూమిని ఖాళీగా వదిలేశారన్నారు. ఆ భూములకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ అధికారులు వేలం నిర్వహించలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మిగిలిన భూములకు వేలం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గోలి ముసలయ్య, వడ్లపాటి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై దాడి కేసు

పెదపూడి: గండ్రేడు గ్రామంలో అతివేగంగా మోటారు బైక్‌లను నడపడమే కాకుండా ప్రశ్నించినందుకు స్థానికులపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఆయన బుధవారం తెలిపిన వివరాల ప్రకారం గత నెల 27వ తేదీ రాత్రి ఆలీఖాన్, వీరబాబు అనే వ్యక్తులు గండ్రేడు గ్రామంలో మోటార్ బైక్‌లను మితిమీరిన వేగంతో నడుపుతూ పదే పదే అటూఇటూ తిరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై వారిద్దరినీ ప్రశ్నించిన కుక్కల నాగేశ్వరరావు, రెడ్ల కిషోర్‌లను కొట్టి గాయపరిచారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి



'నా భూమి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



చినకొండేపూడి ముత్యాలమ్మ చెరువు వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

అనపర్తి: దేశానికి స్వాతంత్ర్యం తేవడం కోసం మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రామ సచివాలయం–5లో నిర్వహించిన 'నా భూమి–నా దేశం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశభక్తిని పెంచేందుకు, స్వాతంత్ర్య సమరయోధుల ఔన్నత్యాన్ని యువతకు తెలియజెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్నవారితో ఎమ్మెల్యే పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కుతుకులూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమర వీరుల స్థూపం ఆవిష్కరణ

పెదపూడి: పెదపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 'నా భూమి– నా దేశం' కార్యక్రమంలో భాగంగా అమరవీరుల స్థూపం, జెండాను ఎంపీపీ కేతా తులసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమాలను అందరూ జయప్రదం చేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటిన ఆమె విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమిల్లిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

రంగంపేట: మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి–నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నా భూమి–నా దేశం' శిలా ఫలకాన్ని గ్రామ పంచాయతీ వద్ద ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి ఆవిష్కరించారు. స్థానిక ఊరు చెరువు గట్టుపై 75 కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ నల్లా పద్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏపీడీ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: నా భూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. సీతానగరంలోని ప్రభుత్వ హైస్కూల్, చినకొండేపూడిలో ముత్యాలమ్మ చెరువు వద్ద ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీవో కె.రమేష్, సర్పంచ్‌లు కోండ్రపు ముత్యాలు, చెరుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీవో నాగేషవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు మురునూరి రామకృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.